# అందమైన రూపం

-మారగాని రాంబాబు

అప్పుడే ఫోన్ మోగటంతో అసహనంగా రిసీవర్ అందుకుని "హలో" అన్నాడు వినయ్.

"హలో వినయ్‌గారేనా? నేను మిహికని" అన్న అవతలి మాటలు విన్పించగానే...

"ఓహో! ఎన్నేళ్ళయిందీ కోకిల కంఠాన్ని విని కలా! నిజమా! ఆమె ఇంకా నన్ను గుర్తుంచు కుని ఫోన్ చేయటం" ఆశ్చర్యంగా ఉందతనికి.

"హలో ట్రాన్స్‌లోకి వెళ్ళిపోయారా?" అనగానే "హలో మిహికా! ఎలా ఉన్నావ్? ఎక్కణ్ణుంచీ" అడిగాడు ఉత్సాహంగా వినయ్.

"ఇక్కణ్ణించే! వచ్చి నాల్రోజులైంది. మా వారికి ఇక్కడికే ట్రాన్స్‌ఫర్ అయింది. మారుతీనగర్ సెకండ్ స్ట్రీట్‌లో ఉంటున్నాం. సాయంత్రం తప్పక వస్తావుకదూ!" అంటూ ఫోన్ పెట్టేసింది.

సాయంత్రం భార్య అందించిన కాఫీ సిప్‌చేస్తూ డైరీని తిరిగేస్తున్నాడు వినయ్.



దాన్ని ఇతరులెవరైనా చూస్తే కవితలూ, రచనలూ అనుకుంటారు. కానీ వాటిని మిహికతో గడిపిన మధుర క్షణాలనూ, స్మృతులనూ వర్ణనలా - అందంగా కవితరూపంలోకి మలుచుకున్నాడు.

పేజీలు తిరగేస్తోన్న అతనిచేయి ఒక పేజీ వద్ద ఆగిపోయింది.

ఆమె... ఆమె...

"అప్సరసలు సైతం అసూయచెందే అందం ఆమెది."

"పెద్దల్ని ఎదిరించలేని గౌరవమనే హృదయాకాశంలో, పిరికితనమనే కాంతిని భరించలేక, తారల్లాంటి అభిమాన ఆప్యాయతల్ని వదలి, ప్రేమమబ్బు నుండి జాలువారిన చినుకులా ఆమె వెళ్ళిపోయింది."

అవును - పెద్దలకి ప్రేమ విషయం చెప్పలేక పోవటం, ఆమె దూరం కావటం తన పిరికితనాన్ని తన్నుతాను తిట్టుకోవటం.

మారుతీనగర్‌కేసి బయలుదేరాడు వినయ్.

గేట్‌తీసి లోనికి వస్తున్న వినయ్‌ని సాదరంగా ఆహ్వానించాడు మిహిక నాన్న.

"నిన్ను చూసి ఎన్నేళ్ళ యిందయ్యా! ఎప్పటిలాగే ఉన్నావ్. నీలో మార్పేమీ లేదయ్యా!" అంటున్న రాఘవయ్యమాటలు అతని చెవికెక్కలేదు. అతని ధ్యాసంతా ఆమెపైనే!

"ఆమె కోకిల కంఠం మారలేదు. అలంకరణలు అమరని అందం ఆమెది. అందానికే నిర్వచనం ఆమె. ఆమెను చూడాలన్న ఆత్రుత ఎక్కువైపోసాగింది వినయ్‌కి.

అపుడే స్నానం చేసి, వచ్చిన మిహికను చూడగానే నిశ్చేష్టుడయ్యాడు.

మనసు నిరాశగా మూల్గింది. ఆమె అప్పటిలా లేదు. ఇద్దరు పిల్లల తల్లి. బాగా లావైంది. కాంతి తరిగిన చంద్రబింబంలా ఆమె మోము, కళ్ళకింద నల్లని వలయాలు.

అంతవరకూ అతని మదిలో మెదులుతోన్న అప్పటి అందమైన రూపం అదృశ్యమైంది. ముభావంగా కొద్ది సేపు మాట్లాడి మౌనంగా ఇంటివైపు నడిచాడు వినయ్ నిరాశా నిస్పృహలతో...!


మారగాని రాంబాబు

1-257, భవాని పేట,

పులివెందుల - 516 370.

కడప జిల్లా.

కొత్త సీరియల్ ప్రారంభం...

**కిరణ్ బాల**



# "ఏ సీమ దానవో..."

మధూ!

**నువ్వు పెట్టిన పరీక్షలో... నేను**

పాస్ మార్కులైనా తెచ్చుకోలేదు.

నేనింత సుద్దమొద్దునని ఇప్పుడే తెల్సింది.

ఇక. -

పరీక్షకు సిద్ధపడే ఓపికలేదు.

నీవు విధించిన శిక్షను

జీవితమంతా శిరసావహించటానికి సిద్ధంగా ఉన్నాను

నీ

-కృష్ణశౌర్య.

ఆమె కళ్ళు అనుకోకుండా ఆ పత్రికా ప్రకటన వెంట పరుగులు తీశాయి. ముందుకు వంగి పత్రికని టేబుల్ మీదనుండి చేతిలోకి తీసుకొంది.తనని ఎవరూ గమనించకుండా ఆ పత్రికని పట్టుకొని చైర్లో వెనక్కివాలి మరోసారి ఆ ప్రకటనని చదివింది.

ఆ ప్రకటన తనకేనని ఆమెకి తెల్సు. అంతటి భావుకత గల వ్యక్తి ఎవరో ఆమెకి బాగా తెల్సు. ఏవేవో జ్ఞాపకాలు హృదయాన్ని చలింపజేస్తున్నాయి. ఇష్టమూ, అయిష్టమూ కాని స్మృతులు... పారిపోతోన్న సైనికుణ్ణి వెన్నంటిన శత్రువుల్లా తరుముకొస్తున్నాయి.

కానీ ఆ హాల్లో ఆ ఇంటి యజమాని వేణుగోపాల రావూ, ఆయన కొడుకు జయంత్ ఉన్నారు. వాళ్ళముందు తన మనోభావాల్ని బహిర్గతం చేసుకోటం ఆమె కిష్టం లేదు.

అనుకోకుండా కన్పించిన ఆ ప్రకటన నిశ్చలంగా ఉన్న మనసుని కల్లోలపరచి కదలించేస్తోంటే అక్కడి నుండి లేచి తన రూంలోకి వెళ్ళిపోవాలన్న కోర్కెని బలవంతంగా అదిమిపట్టుకొంది.

పేపర్ పట్టుకున్న ఆమె నాజూకు చేతులు చిరుగాలి తాకిడికి చలించే చిగురుటాకుల్లాగా కంపిస్తున్నాయి.

ఇంత కాలమూ ఉన్న బింకం, ధైర్యం సడలిపోతాయేమో!

'అలా జరక్కూడదు' అని మనసుని నిగ్రహించుకోటానికీ, ఎదుటి వాళ్ళ దృష్టి తనమీద పడకుండా ఉండటానికీ కాలుమీద కాలు వేస్కొని చిన్నగా కాళ్ళూపుతోంది.

ఆమె కాళ్ళకున్న గజ్జెలు లయబద్ధంగా ఘల్లు ఘల్లుమంటున్నాయి. ఉన్నట్టుండి గొంతు సవరించుకుంటున్నట్టుగా చిన్నగా శబ్దం చేశాడు జయంత్.

ఆమె చేసే పని చీకాకు కలిగిస్తే అతడలా చిన్నగా దగ్గుతూ తన అయిష్టాన్ని తెలియజేస్తాడు.

మొదట్లో ఆమె అర్థం చేస్కోలేదు కానీ ఈ మధ్యనే ఆ విషయం తెలిసొచ్చి - కాళ్ళూపటం ఆపింది.

ఇంతలో రావు చేతిలో ఉన్న పేపర్ని సోఫాలో పడేసి తన రూంలోకి వెళ్ళిపోయారు.

ఆయన వెళ్ళిపోవటంతో ఆ అమ్మాయి ఎందుకో చాలా రిలీఫ్‌గా ఫీలయింది.

అప్పటిదాకా ముఖానికి అడ్డంగా పెట్టుకున్న పేపర్ని తీసి ఒళ్ళో పెట్టుకొని ముందుకు జరిగికూర్చుంది.

'నీ పేరేంటి?'

జయంత్ ఆ అమ్మాయి వైపు చూస్తూ అడిగాడు.

ఆ రూంలో ప్రస్తుతం వాళ్ళిద్దరే ఉన్నారు.

హఠాత్తుగా అతడడిగిన ప్రశ్నకి ఉలిక్కిపడిందామె.

ఇదే వరకు ఇలాగే రెండుసార్లు ప్రశ్నించి నిరుత్తరు డయ్యాడు జయంత్!

ఆమె ఎప్పటిలానే ఈసారీ సమాధానం చెప్పలేదు. కానీ...ప్రకటన చదివి తాను తలెంచిన సంగతి కొంపదీసి గ్రహించేశాడా అని ఆలోచిస్తోంది.

నీ పేరు గజ్జెల గుర్రం!

అక్షరాల్ని వొత్తిపలుకుతూ అక్కసుగా అన్నాడు జయంత్.

ఇంత కాలం తనెవడికో, వాళ్ళు కదిలించటమో అతడికి నచ్చలేదేమో అనుకొంది, కానీ ఇప్పుడు ప్రత్యక్షంగా తన కాళ్ళ పట్టీలంటే అతడి కిష్టంలేదని తెలుసుకొంది.

సగం నింపిన 'క్రాస్‌వర్డ్ పజిల్' ఉన్న పేపర్నిటేబుల్ పైకి విసిరేసి కనుబొమలు పైకెగరేస్తూ అక్కడి నుండి వెళ్ళిపోయాడు జయంత్. ఎదుటివాళ్ళ పట్ల నిర్లక్ష్యాన్ని ప్రకటించేటపుడు అతని ప్రవర్తన అలాగే ఉంటుంది.

ఆమె జయంత్ గూర్చి ఆలోచిస్తోంది. ఇతడికి తనంటే ఎందుకింత కోపం? తన రాక ఇతగాడికి ఇష్టంలేదేమో! ఇష్టంలేని చోట ఇమడటం ఎంత కష్టం!

మళ్ళీ మనసు గతం తాలూకు పొరలు తీస్తోంది. మనసుని నిగ్రహించుకోటం ఎలా అని ఆలోచిస్తోంది.

అమ్మాయిగారూ పెద్దయ్యగారు పిలుస్తున్నారండీ!

పనిమనిషి రత్తమ్మ మాటలతో ఆలోచనల్లోంచి తేరుకొని వాస్తవంలోకి వచ్చిపడింది.

★ ★ ★



అప్పుడే వేణుగోపాలరావు రూంలోకి అడుగుపెట్టింది. ఆయన ముందు ఎప్పుడూ తలయెత్తి మాట్లాడలేదామె.

ముక్తసరిగా... పొడిపొడిగా.. తప్ప. ఒక్కమాట కూడా ఎక్కువగా మాట్లాడే వీలేదు.

రావు తన మంచం మీద కూర్చొని ఉన్నారు.ఎదురుగా కుర్చీ చూపుతూ

'కూర్చో' అన్నారు.

కూర్చుంది. ఆయనంటే ఆమెకి భయం. భక్తి. గౌరవం. ఏవో తెలిసి తెలియని!

కానీ ఆయన మాత్రం ఆ అమ్మాయి దేనికీ భయపడకుండా తనతో ఫ్రీగా ఉండాలని కోరుకుంటారు.

ఆయనతో తనకిష్టమైన విషయాలెన్నో చర్చించాలని ఆ అమ్మాయికి ఉంటుంది.కానీ తన గురించిన వివరాలు మాటల సందర్భంలో దొర్లిపోతే ఎలా?

'ఇంకేమైనా ఉందా?' అని...ఆమె మనసుని నిగ్రహించుకొంటుంది. తన గుండెలోని గతాన్ని గుండెల్లోనే దాచేసుకొంటుంది. తన చుట్టూ గిరిగీసుకొని జీవితం గడిపేస్తోంది.

ఒక్క నిమిషం నిశ్శబ్దం తర్వాత...

'పేపర్లో ప్రకటన చూశావా?'

నిశ్శబ్దాన్ని ఛేదిస్తూ రావు గొంతు గంభీరంగా వినిపించింది.

గుండెలో బాంబు పడ్డంతగా అదిరిపోయిందా అమ్మాయి! అప్రయత్నంగా వెన్నులోంచి జలదరింపు వచ్చింది.

తాను ప్రకటన చదివినపుడు తన ముఖకవళికలు ఆయన చూళ్ళేదు కదా!..? ఏం మాట్లాడాలో తోచలేదా మెకి.

క్షణమాగి వంచిన తల ఎత్తకుండానే అంది.

"ఏ ప్రకటన?"

ఆమె ముఖాన్నే గమనిస్తూ చిన్నగా నవ్వి అన్నారాయన 'అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ నోటిఫికేషన్'

మనసులో పెద్ద భారం దిగిపోయినట్టుగా ఫీలవుతూ గుండెనిండా ఊపిరి పీల్చుకుందామె.

ఆమెనే గమనిస్తోన్న రావు పెదవులపై మందహాసం అలాగే ఉంది...

"నువ్వు డిగ్రీకి ఎంట్రెన్స్ రాయొచ్చు కదా! అప్లికేషన్ ఫాం తెప్పించమంటావా?"

"..........................."

"చదువంటే భయమా?"

"అ.............అహ"

"ట్యూటర్‌ని పెట్టిస్తాను"

"..............."

"చెప్పు బేబీ!"

ఆ అమ్మాయి పేరేంటో ఆయన ఎన్నడూ అడగలేదు. అడిగినా ఆమె చెప్పదని ఆయనకి తెల్సు. అందుకే ముద్దుగా 'బేబీ' అని పిల్చుకుంటారు.

'బేబీ!' అని ఆయన పిలుస్తే చాలు. ఆ అరవై యేళ్ళ వృద్ధుని కోసం ఆమెకి ఏ త్యాగమైనా చేసేయాలనిపిస్తుంది.

ఆయన పిలుపు అలసిన ఆమె హృదయానికి అమృతపు జల్లులా ఊరటనిస్తుంది. పోగొట్టుకున్న అనురాగాన్ని తిరిగి పొందుతున్నంత ఉత్సాహం కలుగుతుంది. అంతలోనే ఆమె ప్రయత్న పూర్వకంగా మనసుని అదుపులో పెట్టుకో గల్గుతుంది.

అయినా ఏ బలహీన క్షణంలోనో ఆయన ముందు బయట పడక తప్పదేమోననే సంశయం, భయం... ఆమెకి ఉండనే ఉన్నాయి.

'మాట్లాడు బేబీ!'

ఆయన మాటల్లో లాలన.

'నేను ఆలోచించుకొని చెప్తా..'

తల పైకెత్తి ఆయనవైపు చూసీ చూడనట్లుగా చూస్తూ సమాధానమిచ్చింది.

'ఇట్సాల్‌రైట్! ఓ రెండురోజుల్లో ఆలోచించుకొని చెప్పు'

★ ★ ★

రావుతో మాట్లాడి వచ్చిన తర్వాత తన రూంలో కొచ్చి కూర్చుందామె.

మళ్ళీ ఆలోచనలు జోరీగల్లా ముసురుకుంటు న్నాయి. ఆలోచించకుండా ఉండాలంటే ఏం చెయ్యాలి?

మాట్లాడాలి. ఎవరితో? ఎవరితోనైనా సరే. ఏం మాట్లాడాలి? ఏదైనా సరే తన లోతు తెలీకుండా సరదాగా మాట్లాడేయాలి.

ఆమె ఆ ఇంటికి వచ్చి చాలా రోజులవుతోంది. కానీ ఎవ్వరితోనూ అట్టే మాట్లాడలేదు. కానీ ఇప్పుడు మాట్లాడాలనుకుంటోంది.

ఇంతలో రూంలోకి పని మనిషి రత్తమ్మ చేతిలో బక్కెట్‌తో వచ్చింది. నేల మీద కూర్చొని రూమంతా తడిగుడ్డతో తుడుస్తోంది.

'ఏయ్ రత్తమ్మా' పిల్చిందా అమ్మాయి.

'ఏంటమ్మా'

మనసు మళ్ళించుకోవాలంటే ఈ రత్తమ్మతో పిచ్చాపాటి

'నీకు పాటలు పాడటం వచ్చా?'

'రావండీ!' రత్తమ్మ సిగ్గుపడింది.

"ఏయ్! అబద్ధం చెప్తున్నావ్. రాకపోతే అలా సిగ్గుపడతావేంటి? చెప్పు వస్తాయి కదూ"

ఇల్లు తుడవటం ఆపి ఆ అమ్మాయి వైపు తిరిగి చెప్పింది రత్తమ్మ.

'ఏవో కూనిరాగాలండీ?'

'ఏం కూనిరాగాలు? నువ్వు పాడు అవి ఏ రాగమో నే చెప్తాలే!

అప్పుడే వేణుగోపాలరావు అటుగా వెళ్తూ ఆ అమ్మాయి మాటలు విని ఆగిపోయారు.

ఆ అమ్మాయికీ, రత్తమ్మకీ ఆయనొచ్చిన సంగతి తెలిదు.

'పాడు రత్తమ్మా' గారాబంగా అంది.

రత్తమ్మ నేలమీద చతికిలబడి పైటకొంగుకి చేతులు తుడుచుకుంటూ కాస్త సిగ్గుపడుతూ అంది.

'మరి మీరు నవ్వకూడదండీ'

## 'అతను' నా గతం



చింపూకపూర్‌తో నగ్మా ప్రేమాయణానికి తెరపడింది. ఇద్దరూ పెళ్ళి చేసుకోకుండానే దూరమయ్యారు. నగ్మా దగ్గర చింపూ ప్రస్తావన ఎవరైనా తీసుకొస్తే చాలు - 'అతని గురించి నేనేమీ మాట్లాడ దల్చుకోలేదు. అతను నా జీవితంలోకి ప్రవేశించిన సమయం ఒక అనుభవం. అయితే అతనిప్పుడు నా 'గతం'. అతన్ని మర్చిపోయి నా జీవితాన్ని అందంగా తీర్చిదిద్దుకుని భవిష్యత్తు వైపు ముందడుగు వేస్తున్నాను. త్వరగా నేనింకా ఎంతో ఎదగాలి' అంటోంది నగ్మా. ఈ సందర్భంగానే నగ్మా మరో మాటకూడా అంది- 'నేనో వ్యక్తిని ప్రేమిస్తే అతన్ని పెళ్ళాడ్డానికి నేను 4-5 సంవత్సరాలు ఎదురుచూడాల్సి రావడం నాకు కుదరదు' అని.

-మౌర్య.

ముందు రత్తమ్మ సిగ్గు చూస్తోంటేనే నవ్వొచ్చేస్తుంది. వస్తోన్న నవ్వుని ఆపుకుంటూ అంది.

'నవ్వనులే! పాడు.'

'నాకు గొబ్బిళ్ళ పాటలూ, జాన పదాలూ వత్తాయండీ!'

'అయితే జానపదం పాడు.'

రత్తమ్మ ఉత్సాహం చూస్తోంటే ఆ అమ్మాయికి ముచ్చటేసింది. బాగానే పాడ్తుంది కాబోలు ననుకుంది. పాటలంటే ఆమెకి ప్రాణం. అక్కడికి వచ్చి ఓ వారం రోజులైనా ఓ ఆటాలేదూ... పాటాలేదు!

'ఈ రత్తమ్మతో బానే కాలక్షేపం అయ్యేటట్టుంది,' మనసులో అనుకొని మంచం మీద బోర్లా పడుకొని రెండుచేతులూ చుబుకం కింద ఉంచుకొని కళ్ళు పెద్దవి చేసి... రత్తమ్మ పాడబోయే పాటకోసం ఆత్రంగా ఎదురుచూస్తోంది.

రత్తమ్మ గొంతు సవరించుకొని పాడటం మొదలెట్టింది.

"నీకూ నీ - వారులేరూ
నాకూ నా - వారు లేరు.
ఏటి వొడ్డున - ఇల్లు కడదాం పదరా!
చల్ మోహనరంగా -
నీకు నాకూ జోడుకుదిరెను కదరా"

రత్తమ్మ కీచుగొంతుతో... పాటలా కాకుండా ఏదో నాటకాల కంపెనీ వాళ్ళు పాడినట్టుగా గొంతు చించుకొని పాడుతూంటే ఆ అమ్మాయి పగలబడి నవ్వింది.

ఆమె అంత బిగ్గరగా నవ్వటం రావు ఎప్పుడూ చూళ్ళేదు. కనీసం ఆమె మందహాసమైనా చూళ్ళేదు. ఎప్పుడూ ఏదో కోల్పోయిన దాన్లా దిగులుగా ఉండేది.

కనీసం కన్నెత్తి తనవైపు చూడటానికైనా సాహసం చేయని ఆ అమ్మాయి తాను లేని సమయంలో ఇంత హుషారుగా ఉంటుందా? నిజంగా ఆమెకి ఇక్కడ సంతోషంగా ఉందా!

రావు చాలా సంతృప్తిగా ఫీలయ్యారు.

'నవ్వొద్దని ముందే చెప్పాను కదండీ... అమ్మాయి గారూ! పాడమంటారు, మళ్ళీ నవ్వుతారేంటండీ!'

రత్తమ్మ కూడా నవ్వేస్తూ అంది.

'పోనీ నీకు ఆటలాడటం వచ్చా?'

ఆ అమ్మాయి ప్రశ్నలో పాటలు ఎలాగూ రావు - కనీసం ఆటలైనా వచ్చా అని 'ఎంక్వైరీ' చేసినట్టుంది.

ఎప్పుడు తాను రూంలో కొచ్చినా ఒకటీ రెండు పొడిమాటలు తప్ప, ఎక్కువగా మాట్లాడని ఈ అమ్మాయి ఇలా గలగలా మాట్లాడేస్తోంటే హుషారొచ్చేసింది రత్తమ్మకి.

'మా సిన్న తనంలో సానా ఆటలాడేవాళ్ళం. నేను చెడుగుడు ఆడేదాన్నండీ!'

రెండు చేతులూ తిప్పుతూ గొప్పగా చెప్తోంది రత్తమ్మ.

'చెడుగుడంటే?' ఆశ్చర్యంగా కనురెప్పలు ఆడిస్తూ అడిందామె.

'చెడుగుడంటే తెలీదామ్మా?'

ఆ ఆటని వివరిస్తోంది రత్తమ్మ.

బయట రావు ఆ ఆట గురించి రత్తమ్మ వివరించి చెప్పటానికి పడ్తోన్న అవస్థకి నవ్వుకున్నారు.

ఆయనకి వాళ్ళ సంభాషణ ఇంకా వినాలని ఉంది. ఏ మాత్రం తన ఉనికిని గమనించినా ఆ అమ్మాయి మౌనం వహిస్తుంది. అది ఆయనకి తెల్సు.

'ఓహో... తెల్సింది! చెడుగుడంటే కబడ్డీయా...

దీర్ఘం తీస్తూ అందా అమ్మాయి.

'నేనూ ఆడేదాన్ని స్కూల్లో చదూకునేటప్పుడు.' తన విషయాలు ఎవ్వరికీ ఏమీ చెప్పకూడదనుకొనీ, నోరుజారి అనేశానని అనుకొంది.

'ఇంకా సానా ఆటలాడే వాళ్ళం' నాటి జ్ఞాపకాల్ని నెమరేసుకొంటోంది రత్తమ్మ.

'గచ్చకాయలాటొచ్చా?' అడిగిందా అమ్మాయి.

'ఓ... సిన్నప్పుడు నేను సానాపైకి ఎగరేసి అందుకొనే దాన్నండీ, అమ్మాయి గారూ!'

రత్తమ్మ మాటల్లో మళ్ళీ గతవైభవ స్మృతులే!

'అయితే ఆడుకుందామా?'

'ఓ...' దీర్ఘంతీస్తూ... అప్పుడు చూసింది రత్తమ్మ రావుని, చటుక్కున తలవంచుకొని నేలతుడవటం మొదలెట్టింది.


రావు వెళ్ళిపోయారు.

**(ఇంకా ఉంది)**

## మనీషా అదృష్టం

'బొంబాయి' సినిమా మనీషాకి అన్ని రకాలుగా కలిసొచ్చింది. ఆ చిత్రం తర్వాత ఆమె అందరి దృష్టిలోనే రావడమే కాకుండా హీరోయిన్‌గా మంచి క్రేజ్‌ను పెంచుకుంది. ఈ సినిమా వరకు 7,8 లక్షల పారితోషికం మాత్రమే తీసుకున్న మనీషా ఇప్పుడు 50 లక్షల వరకు డిమాండ్ చెయ్యగలుగుతోందిట. 'అకేలే హమ్ అకేలే తుమ్' చిత్రంలో కూడా మనీషా చక్కని ప్రతిభ కనబర్చిందనీ, ఈ సినిమాకూడా ఆమె కెరీర్‌కి మరిన్ని ప్లస్‌పాయింట్లు ఇస్తుందని సినీ జనాల ఉవాచ. మొత్తానికి మనీషా అదృష్టవంతురాలు.

-మౌర్య





"జోరుగా గడ్డం, మీసాలు పెంచి, ఒకేసారి ఇలా బోడుగా అయిపోయావేంటిరా?" అడిగాడో ఓ మిత్రుడు.

"అబ్బే! ఏమీ లేదురా, నిన్నరాత్రి మా ఆవిడకి పూలు తెస్తానని తేలేదు అంతే...!"

-కస్తూరి సత్తయ్య,
జగిత్యాల.